క్లుప్తంగా

టెండర్ల ఆహ్వానం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్ పైభాగంలో 12 గదుల నిర్మాణానికి ఈ–టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఈనెల 30వ తేదీ వరకు ***http://tender.telangana.gov.in*** వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కూతురి పుట్టినరోజు సందర్భంగా రక్తదానం

టేకులపల్లి: టేకులపల్లి మండలం బొమ్మనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య మరోసారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బుధవారం తన కుమార్తె అభిజ్ఞశ్రీ పుట్టినరోజు సందర్భంగా 35వ సారి రక్తదానం చేశారు. ఒక సేవా సంస్థను 25 సంవత్సరాల నుంచి తన తండ్రి పేరు మీద నడుపుతూ రక్తదానం చేయండి.. అని పిలుపునిస్తూ ముందుకు సాగుతున్నారు. పిండిపోలు రామయ్య సేవాసంస్థ ద్వారా రక్తదానం శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేటి ర్యాలీని విజయవంతం చేయండి..

కొత్తగూడెంటౌన్: మాదకద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల సందర్భంగా గురువారం జరగనున్న ర్యాలీని విజయవంతం చేయాలని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటలకు కొత్తగూడెం రైల్వేస్టేషన్ నుంచి ప్రకాశం స్టేడియం వరకు ర్యాలీ ఉంటుందని, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తా..



మీనాక్షి నటరాజన్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న సీతారాములు

సుజాతనగర్: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తానని టీపీసీసీ జనరల్ సెక్రటరీగా నియమించబడిన నాగా సీతారాములు అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా బుధవారం నాగా సీతారాములు నియామకపత్రం అందుకున్నారు. సీతారాములు మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తానని, పార్టీ విధివిధానాలకు కట్టుబడి ఉంటానని చెప్పారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ స్టడీ సెంటర్ మంజూరు

టేకులపల్లి: 2025–26 విద్యా సంవత్సరం నుంచి టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ మరియు ఇంటర్ స్టడీ సెంటర్ మంజూరు అయిందని హెచ్‌ఎం మేరుగు శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలో బడి మానేసిన పిల్లలు, ఇతరులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ స్టడీ సెంటర్‌కు సంబంధించి పూర్తి వివరాలకు 9704024681 నంబరులో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ఇవ్వండి..

జూలూరుపాడు: రైతులకు విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై ఇవ్వాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ రాంబాబు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడులో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు.

డేవిడ్‌కు సత్కారం

ఇల్లెందు: ఇల్లెందులపాడుకు చెందిన మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సంఘ సేవకుడు మల్లెల డేవిడ్‌ను బస్తీవాసులు బుధవారం స్థానిక పాఠశాలలో శాలువ, పూలమాలతో సత్కరించారు. గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నాడని, తన పింఛన్ డబ్బులను రోడ్లు, కాలువల మరమ్మతుల కోసం ఖర్చు చేస్తున్నాడని కొనియాడారు.

మృతులకు నివాళి

ఇల్లెందురూరల్: మండలంలోని ఎల్లాపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన నర్సయ్య, ప్రవీణ్‌లకు బుధవారం పలువురు నివాళులర్పించారు. వారి భౌతిక కాయాలను మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, న్యూడెమోక్రసీ, పీవైఎల్ నాయకులు రమేష్, తుపాకుల నాగేశ్వరరావు, మోతీలాల్, నర్సింహారావు, జోగ రమేష్, ఇర్ప విజయ్ తదితరులు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

కొన్ని రూట్లకే పరిమితమా?



ఉల్వనూరు వచ్చి వెళ్తున్న ఆర్టీసీ బస్సు





బస్సులు రాకపోవడంతో ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు

- 'మహాలక్ష్మి'ని కోల్పోతున్న మహిళలు, విద్యార్థినులు
- భారంగా ఆటోల్లో ప్రయాణం

పాల్వంచరూరల్: ఎర్ర బస్సు ఎక్కాలని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ప్రజలకు ఎట్టకేలకు పాల్వంచ నుంచి ఉల్వనూరు వరకు ఆర్టీ బస్సును పునరుద్ధరించడంతో ఊరట లభించింది. అయితే మరి మా రూట్... నాగారం, దంతబోరు, పాండురంగాపురం గ్రామాల పరిస్థితి ఏమిటని మహిళలు, విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన ఆర్టీసీ ఉచిత ప్రయాణం సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు నడవడం లేదు. ఒకప్పుడు మారుమూల గ్రామాలకు రహదార్లు సక్రమంగా లేవన్న సాకుతో బస్సులను నడపలేదు. రాష్ట్రం ఆవిర్భావం జరిగిన తర్వాత ఏజెన్సీలోని మారుమూల గిరిజన గ్రామాలకు కూడా రోడ్లు నిర్మించారు. అయినా ఆర్టీసీ అధికారుల ప్రణాళికా లోపంతో బస్సులను నడపకపోవడంతో పాల్వంచ మండలంలో సోమవరం పాల్వంచ నుంచి ఉల్వనూరు వరకు బస్సు సర్వీసును ఎమ్మెల్యే కూనంనేని ప్రారంభించారు. ఇటువైపు ఉన్న మారుమూల గ్రామాలకు బస్సులు నడవక ప్రజలకు ఆర్టీసీ బస్సు ఎక్కే భాగ్యం కలగడం లేదు. నిత్యం ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు..

గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు చదువుల కోసం వచ్చే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. పాల్వంచ మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన చంద్రాలగూడెం, రేగులగూడెం, నర్సింహాసాగర్, మల్లారం, సారెకల్లు, కారెగట్టు, రెడ్డిగూడెం, పాండురంగాపురం, సూరారం, సోములగూడెం, దంతలబోరు, తోగ్గూడెం, నాగారం గ్రామాలకు ప్రభుత్వం రూ.కోట్లు వ్యయం చేసి తారు రోడ్లు, వాగులపై బ్రిడ్జిలు నిర్మించినా బస్సులు నడపడం లేదు. మండల కేంద్రమైన పాల్వంచకు 40 కిలోమీటర్లపైన గిరిజన గ్రామాలు ఉన్నాయి. దంతల బోరు నుంచి రూ.40 ఎస్సీ కాలనీ నుంచి పాల్వంచకు రూ.30 చొప్పున ఆటో చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో నిరుపేద విద్యార్థులకు భారమై చదువులకు దూరమవుతున్నారు. దంతలబోరు ఎస్సీ కాలనీ పంచాయతీ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని గతేడాది స్థానికులు డీఎంకు విన్నవించారు. స్పందించిన ఆయన మొక్కుబడిగా కొద్దిరోజులు బస్సు నడిపించి నిలిపివేశారు. కొంత కాలం భద్రాచలం డిపో బస్సు నడిచేది. ఇప్పుడు అది కూడా రావడం లేదు. ఉల్వనూరు వరకే బస్సు నడపడం వలన... మల్లారం, బంజర, మామిడిగూడెం, రేగులగూడెం ప్రజలు ఐదారు కిలోమీటర్లు వచ్చి బస్సు ఎక్కాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి పాల్వంచ మండలంలో తారు రోడ్డు ఉన్న ప్రతీ గ్రామానికి బస్సులు నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇలా అయితే ఆర్టీసీకి ఆదాయం...

కొత్తగూడెం డిపో నుంచి పాల్వంచ బస్టాండ్ మీదుగా పెద్దమ్మగుడి, సోములగూడెం, కమ్మరిగూడెం, సూరారం, పాండురంగాపురం, రెడ్డిగూడెం, యానంబైల్, రాజాపురం మీదుగా కిన్నెరసాని వరకు నిత్యం బస్సును నడిపితే పెద్దమ్మతల్లి భక్తులకు, కిన్నెరసాని వెళ్లే పర్యాటకులకు సౌకర్యంగా ఉంటుంది. ఆర్టీసీ కూడా ఆదాయం వస్తుందని ప్రయాణికులు అంటున్నారు.

'మహాలక్ష్మి' అందడం లేదు..



ఆర్టీసీ బస్సు నడవకపోవడంతో ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం అందకుండా పోతోంది. మండల కేంద్రానికి వెళ్లి చదువుకునే నిరుపేద విద్యార్థులు ఆటో చార్జీల భారం భరించలేక చదువులను మధ్యలోనే నిలిపివేస్తున్నారు.
– తెల్లం అలివేలు, గంగాదేవిగుప్ప

సర్వీసును పునరుద్ధరించాలి..



గిరిజన ప్రాంతమైన దంతల బోరుకు బస్సు సర్వీసును నిలిపివేయడంతో ప్రయాణికులు, విద్యార్థులు పాల్వంచకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆర్టీసీ డీఎం స్పందించి బస్సును పునరుద్ధరించాలి.
– జి.వెంకటేశ్వరరెడ్డి, నారాయణరావుపేట

ఆ రూట్‌ను పరిశీలిస్తాం..



ఎక్కడ ఆర్టీసీ బస్సు నడిపితే ఆదాయం వస్తుందో ఆ రూట్‌ను పరిశీలిస్తాం. ఆ తరువాత బస్సులను నడిపించే విధంగా చర్యలు తీసుకుంటాం. నాగారం, దంతలబోరు రూట్‌లో బస్సు నడిపించాలని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా చెప్పారు.
– ఎం.దేవేందర్ గౌడ్, ఆర్టీసీ డిపో మేనేజర్, కొత్తగూడెం

ఇందిరమ్మ ఇళ్లు 'తారుమారు'

జూలూరుపాడు: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని, విచారణ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. రాజకీయ జోక్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అనర్హులను ఎంపిక చేసినట్లు ఆరోపించారు. ప్రజాపాలనలో నూతన రేషన్ కార్డులు మంజూరైనప్పటికీ జారీ చేయడం లేదని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ రాక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు.



తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, గుండెపిన్ని మధుసూదన్‌రావు, యాసా రోశయ్య, ఎస్కే చాంద్‌పాషా పాల్గొన్నారు.

సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

ఇల్లెందు: పట్టణంలోని సీపీఎం కార్యాలయం ఏలూరి భవన్‌లో మండల స్థాయి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభం అయ్యాయి. సీపీఎం జిల్లా నాయకులు ఏజే రమేష్ రాజకీయ శిక్షణ తరగతుల విశిష్టతను వివరించారు. పార్టీ సీనియర్ నాయకులు ముత్యాలు జెండా ఆవిష్కరించారు. మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఆర్‌ఎస్‌ఎస్ – మతోన్మాదం అనే అంశం సీపీఎం జిల్లా నాయకులు దొడ్డా రవికుమార్ బోధించారు. అబ్దుల్ నబీ, కృష్ణ, మోహన్‌రావు, సుల్తానా, మాదారపు వెంకటేశ్వర్లు, సంధ్య, ఖాదర్, వెంకటమ్మ పాల్గొన్నారు.

మినీ కాలువలను స్వాగతిస్తున్నాం..



మాట్లాడుతున్న మచ్చ వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): సీతారామ ప్రాజెక్ట్ పరిధిలో మినీ డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌ను సీపీఎం జిల్లా కమిటీ స్వాగతిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఈ జిల్లా ప్రజానీకానికి, భూములకు నీళ్లు రావాలనే ఆందోళన, ఉద్యమాన్ని సీపీఎం ప్రారంభించిందని, ఈ ఉద్యమ పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవటం హర్షించదగిన పరిణామమన్నారు. భూములు కోల్పోతున్న రైతాంగానికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇల్లెందు, టేకులపల్లి, కామేపల్లి మండలాల మీదుగా బయ్యారం పెద్ద చెరువుకు నీరు చేరవలసి ఉందని ఈ వివరాలు ప్రభుత్వం కానీ, అధికారులు కానీ ప్రజలకు తెలియజేయటం లేదని ఆరోపించారు.

'రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు..'

కొత్తగూడెంఅర్బన్: భారత రాజ్యాంగాన్ని దివంగత ప్రధాని ఇందిరాగాంధీ అపహాస్యం చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం యువ మోర్చా ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని పులిపాటి ప్రసాద్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో బైరెడ్డి మాట్లాడారు. 1975 జూన్ 25వ తేదీన ఎమర్జెన్సీ విధించి రాజకీయ నాయకులను, కార్యకర్తలను నిర్బంధించారని, పాత్రికేయుల స్వేచ్ఛను హరించి పౌరుల ప్రాథమిక హక్కులను నిలిపివేశారని విమర్శించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దేశ ద్రోహానికి పాల్పడిందని, ఎందరో జీవితాలను బలిగొన్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాలోత్ గాంధీ నాయక్, రెడ్డెం నవీన్ కుమార్, నల్లవెల్లి కవిత, అరుణ, కళావతి, పవన్ కల్యాణ్, వినోద్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో..

సింగరేణి(కొత్తగూడెం): భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించిందని, నేడు మోదీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మంచికంటి భవన్‌లో 50 ఏళ్ల ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యం – నేటి సవాళ్లు అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ... ఎమర్జెన్సీ పోరాట స్ఫూర్తితో నేడు మతోన్మాద వ్యతిరేక పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 50 సంవత్సరాల క్రితం ఇదే రోజున దేశంలో ఎమర్జెన్సీ విధించారని, అర్ధరాత్రి దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు 1.13 లక్షల మందిని ప్రభుత్వం అరెస్ట్ చేసినట్లు వార్తలు వచ్చాయన్నారు. ఇందులో కార్మిక యూనియన్ల, విద్యార్థి నాయకులే ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సీతారాం ఏచూరి ఎమర్జెన్సీని ధైర్యంగా ఎదురించిన నాయకుడన్నారు. హైదరాబాద్‌లో హెచ్‌ఎంటీ, ఈసీఐఎల్, ఐడీపీఎల్ పరిశ్రమల్లో అనేకమంది నాయకులను రాజమండ్రి జైలుకు పంపారన్నారు. ఖమ్మంలో 15 మంది ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పోలీసుల కంటపడకుండా కార్యకలాపాలు సాగించినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రభుత్వ భూములను కాపాడండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సమాచార హక్కు సాధన స్రవంతి జిల్లా అధ్యక్షుడు బండ శ్రీధర్‌రెడ్డి కొత్తగూడెం ఆర్డీఓ మధుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. సమాచార హక్కు చట్టం–2005 ప్రకారం చేసిన దరఖాస్తు ఆర్‌టీఐ హియరింగ్‌లో భాగంగా ఆర్డీఓను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమ కట్టడాలు చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బోడికల ప్రేమ్‌దయాళ్, జితేందర్ పాల్గొన్నారు.

స్టాండరైజేషన్ కమిటీ సభ్యుడిగా పవన్‌కుమార్



సింగరేణి(కొత్తగూడెం): స్టాండరైజేషన్ కమిటీ సభ్యుడిగా బీఎంఎస్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పవన్‌కుమార్‌ను నియమించినట్లు ఆ యూనియన్ ఏబీకేఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జేబీసీసీఐ 11వ వేతన ఒప్పందంలో క్యాడర్ స్కీమ్, ప్రమోషన్లు, డిజిగ్నేషన్ల మార్పులపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

'సంక్షేమాన్ని' సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లెందురూరల్: ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కలిగి ఉంటేనే సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై మండలంలోని రాఘబోయినగూడెం గ్రామపంచాయతీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తరచుగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించడంతోపాటు గ్రామసభలు నిర్వహించినప్పుడు విధిగా హాజరైతే ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరవుతున్న పలు సంక్షేమ పథకాలను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కవిత

స్థానికులకే అవకాశం కల్పించండి..



మాట్లాడుతున్న రాసుద్దీన్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని వీకే–7ఓసీలో బి.రిజిష్టర్ ప్రకారం స్థానికులకే అవకాశం ఇవ్వాలని, ప్రైవేట్ సంస్థలో సింగరేణి నిబంధనలు ఉల్లంఘిస్తే చూస్తూ ఊరుకోమని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు రాసుద్దీన్, కార్యదర్శి వెంకన్న హెచ్చరించారు. బుధవారం కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగూడెంలో కొత్తగా రాబోతున్న ఓబీ సోదా కంపెనీ స్థానికులకు అవకాశం ఇవ్వాలని, స్థానికేతరులకే ఎక్కువ అవకాశం కల్పిస్తే పోరాటాలు తప్పవన్నారు. సింగరేణిలో ఇంతకు ముందెన్నడూ లేని కొత్త నిబంధనలను ఈ సోదా కంపెనీ తెస్తోందని, దీనిని మిగతా ప్రైవేట్ ఓబీ కంపెనీలు అనుసరించే ప్రమాదం ఉందన్నారు.

దీన్ని తక్షణమే ఉపసంహరించుకుని పాత పద్ధతిలోనే రిక్రూట్‌మెంట్ కొనసాగించాలని కోరారు. జీకే ఓసీ విస్తరణలో 600 మంది కార్మికులు గతంలో భూములు కోల్పోయి అక్కడ ఓబీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అలాంటి కార్మికులను కాదని ప్రైవేట్ ఏజెన్సీల రూపంలో దరఖాస్తు చేసుకోండి ఉద్యోగాలు ఇస్తామనడం సరైంది కాదన్నారు.

ఈ కార్యక్రమంలో నెమెళ్ల సంజీవ్, మల్లికార్జున్ రావు, గౌని నాగేశ్వరరావు, వాసు, అశోక్, శ్రీనివాస్, చందర్, సురేష్, రమేష్, వెంకన్న, రాజు, విజయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు న్యాయం చేయండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని రైతుబజార్ ఎదురుగా ఉన్న మున్సిపల్ మార్కెట్ వ్యాపారస్తుల పరిస్థితి దయనీయమంగా మారిందని, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని టీపీసీసీ సభ్యుడు జేబీ శౌరి అన్నారు. నిలిపోయిన మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. 50 కుటుంబాలు 45 రోజులుగా ఇబ్బంది పడుతున్నారని, దీనికి కారణం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, యంత్రాంగం, అలాగే సింగరేణి ఎస్టేట్ అధికారులు బాధ్యతారాహిత్యమే అన్నారు. పదేళ్ల క్రితం కూలీలైన్ వెల్ఫేర్ సెంటర్, స్కూల్ సెంటర్ అలాగే పాత క్వార్టర్లు 100 సంవత్సరాల క్రితం కట్టినవి శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ చిరువ్యాపారులు తోపుడు బండ్లు పెట్టుకొని కూరగాయలు, పండ్లు అమ్ముకుంటున్నట్లు చెప్పారు. వారి విజ్ఞప్తి మేరకు ఆనాటి ఎమ్మెల్యే చొరవతో ఖాళీ స్థలంలో తోపుడు బండ్లు పెట్టుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు వారిని ఖాళీ చేయించి రూ.50 లక్షలతో కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభించగా.. సింగరేణి అధికారులు అడ్డుకున్నట్లు చెప్పారు. తక్షణమే కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణ జరిపి చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ గౌస్, అబ్దుల్ కరీం, స్థానిక వ్యాపారులు నవీన్, బర్కత్, చందర్, లక్ష్మి, చిట్టి, కవిత తదితరులు పాల్గొన్నారు.



నిలిచిన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేటి బాలలే రేపటి పౌరులు



మాట్లాడుతున్న సీఐ ప్రతాప్

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థి దశలోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించే బాధ్యత సమాజానిదని, టూ టౌన్ సీఐ ప్రతాప్ అన్నారు. బుధవారం చుంచుపల్లి మండలం ధన్‌బాద్ పంచాయతీ పరిధిలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... మాదకద్రవ్యాల నివారణ అవగాహన వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థి దశలోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించేందుకు తల్లితండ్రులతోపాటు, ఉపాధ్యాయులదని, వారిని సక్రమైన మార్గంలో నడిపించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రధానంగా డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా చూడాలని చెప్పారు. మత్తుపదార్థాల నుంచి యువతను కాపాడుకోవాలన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, రవాణాకు సులభ మార్గాలని, విద్యార్థులు, యువత వీటికి బలైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తులో ఉన్న వ్యక్తి తన చర్యలను గుర్తించలేడని, ఈ అలవాటు అనేక ఆరోగ్య సమస్యలతో పాటు నేరపూరిత జీవితానికి దారి తీస్తుందన్నారు. డ్రగ్స్ వైపు అడుగులు వేయొద్దని, ఇవి ఒక వ్యక్తినే కాదు కుటుంబాన్ని నాశనం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వానం

- దుర్గంధం వెదజల్లుతున్న డ్రెయినేజీలు
- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలు

జూలూరుపాడు: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానం ఉంది. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతో చెత్తచెదారం పేరుకపోయింది. ఏ గ్రామంలో చూసినా చెత్తకుప్పలు, పెంటకుప్పలు, ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగు కదలక దుర్గంధం వెదజల్లుతున్నాయి. పంచాయతీ ప్రత్యేక అధికారుల పాలనతో పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించింది. ఆయా ప్రత్యేక అధికారులు పల్లెల వైపు కన్నెత్తి చూడకపోవడంతో పట్టించుకునే వారు లేరు. గ్రామాల్లో అక్కడక్కడ పారిశుద్ధ్య పనులు మొక్కుబడిగా చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. జనవరి, 2024తో గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినాటి నుంచి 16 నెలలుగా పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడంతో పంచాయతీల నిర్వహణ, అభివృద్ధి కుంటుపడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రాకపోవడంతో పల్లెల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం మరింత దయనీయంగా మారింది. సీజనల్ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలైట్ల వెలగడం లేదని, తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. డ్రెయినేజీల్లో పూడిక తీయకుండా బ్లీచింగ్ చల్లుతున్నారని, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు పెరిగి దోమలు విజృంభిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను కేటాయించగా, నిధులు ఆయా పంచాయతీలే సమకూర్చుకున్నాయి. కానీ నిర్వహణ భారంగా మారింది. జూలూరుపాడు మండలంలో 24 గ్రామ పంచాయతీలకు 24 ట్రాక్టర్లు ఉన్నాయి. పలు పంచాయతీల్లోని ట్రాక్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. అదే విధంగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు కూడా సరిగా ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వెంగన్నపాలెం ఎస్సీకాలనీలోని డ్రెయినేజీలో కదలని మురుగు



జూలూరుపాడు కోయకాలనీలో రోడ్డు పక్కన పేరుపోయిన చెత్త

ఎవరూ పట్టించుకోవడం లేదు...



వెంగన్నపాలెం ఎస్సీకాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో డ్రెయినేజీల్లో పూడిక పేరుకపోయి దుర్వాసన కొడుతున్నాయి. దోమలు, పురుగులు పెరుగుతున్నాయి. వీధిలైట్లు వెలగక నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.
– కె ఉమామహేశ్వరి, వెంగన్నపాలెం ఎస్సీ కాలనీ

వర్షం నీరు ఇళ్లలోకి చేరుతోంది..



రహదారి విస్తరణ పనుల కారణంగా కొద్దిపాటి వర్షానికే వరద ఇళ్లలోకి చేరుతోంది. ఈ పనులు పూర్తయినా కూడా వర్షపు నీరు దిగువకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఇళ్లలోకి, రోడ్డుపై నిల్వ లేకుండా అధికారుల చర్యలు తీసుకోవాలి.
– మల్కం కిరణ్, జూలూరుపాడు కోయకాలనీ

నిధుల కొరత ఉంది...



నిధుల కొరత కారణంగా గ్రామ పంచాయతీ నిర్వహణ భారంగా మారింది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినాటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో ఇబ్బందిగా ఉంది. జనరల్ ఫండ్‌తో గ్రామాల్లో పనులు చేపడుతున్నాం.
– టి.తులసీరామ్, ఎంపీఓ